# ఓటెత్తిన చైతన్యం

- మునుగోడు నియోజకవర్గం రాష్ట్రంలో అత్యధికంగా ఓటింగ్ శాతం నమోదు
- మధ్యాహ్నం తర్వాత పెరిగిన ఓటింగ్
- ఉప ఎన్నికతో పోల్చితే .49 శాతం తగ్గిన పోలింగ్



మునుగోడు : కొంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న మహిళలు మహిళలు, పురుషులు (ఫైల్)

చౌటుప్పల్, డిసెంబర్ 1 : మునుగోడు నియోజకవర్గంలో ఓటరు చైతన్యం వెల్లివిరిసింది. ఓటర్లు పెద్ద సంఖ్యలో హాజరై ఓటు వేశారు. రాష్ట్రంలోనే అత్యధికంగా పోలింగ్ మునుగోడు నమోదయింది. 2014 మునుగోడులో 82.15 శాతం పోలింగ్ నమోదు కాగా 2018లో 91.07కు పెరిగింది. 2023లో 91.51శాతం పోలింగ్ నమోదయింది. ఉప ఎన్నికలో 92 శాతం ఓటింగ్ నమోదైంది. ప్రస్తుతం ఉప ఎన్నికతో పోలిస్తే .49శాతం తగ్గింది. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ఓటింగ్ 29.04 శాతం పెరిగింది. దాంతో నియోజకవర్గంలోని వివిధ పల్లెలో జనం అత్యధికంగా ఓటెత్తడ ంతో బీఆర్ఎస్‌సంక్షేమ పథకాలే కారణంగా ప్రజలు భావిస్తున్నారు. వివిధ అభివృద్ధి పథకాలు ప్రతి ఒక్కరికీ దరిచేరడంతో ఇదంతా సాధ్యమైందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మధ్యాహ్నం తర్వాత పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు పెద్ద ఎత్తున పోటెత్తడంతో బీఆర్ఎస్‌కు కలిసొచ్చే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.

### కట్టంగూర్‌లో @ 88.52 శాతం పోలింగ్

కట్టంగూర్: అసెంబ్లీ ఎన్నికల్లో గురువారం జరిగిన పోలింగ్‌లో మండలంలో 88.52 శాతం పోలింగ్ నమోదయింది. 2018లో జరిగిన ఎన్నికల్లో 89.55 శాతం ఓట్లు పోలయ్యాయి. గతం కంటే మండలంలో 1.03 శాతం తగ్గింది. మొత్తం 36,642 ఓటర్లు ఉండగా 32,439 మంది తమ ఓటు వినియోగించుకున్నారు. మండలంలోని 22 గ్రామపంచాయతీలతో పోలింగ్ నమోదు ఈ విధంగా ఉన్నాయి. పిట్టంపల్లిలో 934మంది ఓటర్లకు 897మంది, భాస్కర్లబాయిలో 529 మందికి 494 ఇస్మాయిల్‌పల్లిలో 973మందికి 893, పామనుగుండ్లలో 939 మందికి 884, ఎర్సానిగూడెంలో 1,036 మందికి 903, పరడలో 1,965 మందికి 1,747, ఈదులూరులో 2,960 మందికి 2,416, నారెగూడెంలో 1,111 మందికి 993, పందనపల్లిలో 837 మందికి 733,కురుమర్తిలో 1,938 మందికి 1,774, మునుకుంట్లలో 2,054 మందికి 1,765, కల్మెరలో 1,412 మందికి 1,284, దుగినవెల్లిలో 1,704మందికి 1,417, ముత్యాలమ్మగూడెంలో 1,807 మందికి 1,584, కట్టంగూర్‌లో 5,603 మందికి 4,935, బొల్లెపల్లిలో 1,856 మందికి 1,665, మల్లారంలో 520 మందికి 464, రామచంద్రపురంలో 691 మందికి 640, అయిటిపాములలో 4,642 మందికి 4,071, చెర్వుఅన్నారంలో 1,980మందికి 1,818, గార్లబాయిగూడెలో 954 మందికి 887 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

### ఫలితాలపై జోరుగా బెట్టింగ్‌లు

నల్లగొండ సిటీ : ఎన్నికల్లో ఓటింగ్ ప్రక్రియ ముగియడంతో అభ్యర్థులంతా ఓట్ల కూడికలు, తీసివేతల్లో మునిగిపోయారు. మరోపక్క గెలుపు ఎవరిది అనే దానిపై జోరుగా బెట్టింగ్‌లు ప్రారంభమయ్యాయి. జిల్లాలో మూడు నియోజక వర్గాల్లో ఇవి కొనసాగుతుండడం ఉత్కంఠ రేకెత్తిస్తుంది. అన్ని పార్టీలు ఓటర్లను ఆకర్షించేలా హామీలు ఇవ్వడంతో గెలుపు తమదే అవుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. దాంతో ఆయా పార్టీల కార్యకర్తలు జోరుగా బెట్టింగ్‌లు పెడుతున్నారు. తమ అభ్యర్థి గెలుస్తాడని ఒక పార్టీ వారు మా పార్టీ గెలుస్తుందని మరో పార్టీ వారు బెట్టింగ్ పెట్టడం జిల్లాలో హట్ టాఫిక్‌గా మారింది.

### ఓటింగ్ తీరుపై నేతల చర్చ

చిట్యాల, డిసెంబర్ 1 : అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. దాదాపు 40 రోజులుగా సాగిన ఎన్నికల ప్రస్తానంలో చివరి అంకం చేరుకున్నాం. ఇక ఫలితమే మిగిలి ఉంది. ఈ నేపథ్యంలో గురువారం ఓటింగ్ తీరుపై అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు చర్చికుంటున్నారు. ఎవరికి వారే తమకు వచ్చే ఓట్లపై అంచనాలు వేసుకుంటున్నారు. వివిధ పార్టీలకు చెందిన వారు, స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నప్పటికీ ప్రధానంగా రెండు పార్టీల మధ్యనే పోరు సాగింది. దాంతో ఈ రెండు పార్టీలకు సంబంధించిన ముఖ్య నాయకులు, అనుచరులు, బూత్ ఇన్‌చార్జీలతో పాటు ఇతర అభ్యర్థులకు సంబంధించిన వారు ఆయా బూత్‌లలో ఎవరెవరికీ ఎన్నెన్ని ఓట్లు పడే అవకాశం ఉందని శుక్రవారం ఉదయం నుంచి ఓ అంచనాకు రావడానికి ప్రయత్నిస్తున్నారు. గెలుపోటములపై ప్రజలు ఓ అంచనాకు వచ్చినప్పటికీ నాయకులు మాత్రం ధీమాలో ఉన్నారు. ప్రధాన పార్టీలకు సంబంధించిన అభ్యర్థులకు సంబంధించిన వారు ఓటింగ్ తీరుకు సంబంధించి తాము చేసిన పొరపాట్లు, కలిసొచ్చిన అంశాలపై చర్చించుకుంటున్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది, ఎగ్జిట్ పోల్ ఫలితాలు ఇలా ఉన్నాయని చర్చిస్తూ ఇంకా ఎన్నికల మూడ్‌లోనే ఉన్నారు. ఆదివారం వరకు ఈ వాతావరణం ఇలాగే ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

## కనగల్ మండలంలో పెరిగిన ఓటింగ్ శాతం

నల్లగొండ సిటీ : కనగల్ మండలంలో గత ఎన్నికలతో పోల్చితే ఈసారి ఓటింగ్ శాతం పెరిగినట్లు అధికారుల పేర్కొన్నారు. 2018లో మండలంలో 84.18 శాతం ఓటింగ్ నమోదు కాగా గురువారం జరిగిన ఎన్నికలో 91.88 శాతం పోలింగ్ నమోదయింది. దాంతో సుదూర ప్రాంతాల నుంచి ఓటు హక్కు వినియోగించుకున్నారు. దాదాపు ప్రతి గ్రామం నుంచి 2-3 శాతం వరకు పోలింగ్ పెరిగింది.

## 'నల్లగొండ'లో అత్యల్ప ఓటింగ్

### పోలింగ్ @81.60

నల్లగొండ, డిసెంబర్ 1: అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో గురువారం జరిగిన పోలింగ్‌లో నల్లగొండ నియోజక వర్గంలో అత్యల్ప ఓటింగ్ నమోదయింది. అత్యధికం గా మునుగోడులో 91.89 శాతం ఓటింగ్ నమోదు కాగా పట్టణ జనాభా ఎక్కువ ఉన్న నల్లగొండ నియోజక వర్గంలో మాత్రం 81.60శాతం పోలింగ్ నమోదైంది. నియోజక వర్గంలో ఉదయం 9 గంటలకు 9.01 శాతం ఓటింగ్ నమోదైంది. ఆ తర్వాత 11గంటలకు 17.6 శాతం, మధ్యాహ్నం 1గంటలకు 41.60 శాతం నమోదై 3 గంటలకు 60.6 శాతం, ఐదు గంటలకు 70.10శాతం నమోదు కాగా పోలింగ్ ముగిసే సరికి 81.60శాతం ఓటింగ్ నమోదైంది. నియోజక వర్గంలో 2,44, 460 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 1,19,434 మంది ఉండగా 1,24,972 మంది స్త్రీలు, 54 మంది ఇతరులు ఉన్నారు. ఇందులో 97,529 మంది పురుషులు తమ ఓటు హక్కు వినియోగించుకోగా(81.66శాతం), స్త్రీలు 1,01,914 మంది (81. 55 శాతం) తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలీస్ బందో బస్తు ఎన్నికల అధికారుల పటిష్ట చర్యల వల్ల నల్లగొండ, కనగల్, తిప్పర్తి, నల్లగొండ మండలం, మాడ్గులపల్లి మండలాల్లో ఓటింగ్ ప్రశాంతంగా జరిగినట్లు ఆర్వో రవి తెలిపారు.



కిష్టయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముదిరాజ్‌లు

## పోలీస్ కిష్టయ్యకు ఘన నివాళి

నల్లగొండ రూరల్, డిసెంబర్ 1: తెలంగాణ మలిదశ తొలి అమరుడు పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ 14 వ వర్ధంతిని తెలంగాణ ముదిరాజ్ మహాసభ నల్లగొండ కమిటీ ఆధ్వర్యంలోశుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గడియారం సెంటర్‌లో అమరవీరుల స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి బోళ్ల వెంకట్ ముదిరాజ్ శాగంటి రాములు , జిట్టబోయిన ఆంజయ్య, సింగారం మల్లయ్య, సత్తయ్య, సిద్దం వెంకన్న, నిమ్మల సైదులు, వెంకటేశ్వర్లు, రాము, కృష్ణయ్య, నర్సింహ, ఆంజి, శ్రీను పాల్గొన్నారు.

# బిజీ నుంచి కాసేపు సరదాగా ..

- పోలింగ్‌పై కార్యకర్తలతో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విశ్లేషణ



నకిరేకల్ బీఆర్ఎస్ కార్యాలయంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులతో ఎన్నికల సరళిపై చర్చిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్, డిసెంబర్ 1 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కొన్ని రోజులుగా పార్టీ సమావేశాలు, ప్రచారంతో బిజిబిజీగా గడిపిన నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య శుక్రవారం ఉదయం నార్కట్‌పల్లిలో కుటుంబ సభ్యులతో కాసేపు గడిపారు. ఎమ్మెల్యే షెడ్యూల్ జరిగింది ఇలా..ఉదయం 5.00 గంటలకు వాకింగ్ వెళ్లారు..అక్కడి కలిసిన వాకర్లతో ముచ్చటించారు. 6నుంచి 7 గంటల వరకు దినపత్రికలు చదివారు. 7 నుంచి 10 గంటలకు ఇంట్లో పూజా కార్యక్రమాల్లో పాల్గొని, కుటుంబ సభ్యులతో గడిపారు. తన మనువరాళ్లతో కలిసి ఆడుకున్నారు. అనంతరం నార్కట్‌పల్లి పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో 10 నుంచి 1 గంట వరకు రామన్నపేట, చిట్యాల, నార్కట్‌పల్లి మండలాల నుంచి, వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు, బూత్ ఏజెంట్లతో కలిసి ఎన్నికల పోలింగ్ సరళిపై గ్రామాల వారీగా, బూతుల వారీగా చర్చించారు. లంచ్ ముగించిన తరువాత మధ్యాహ్నం 3 గంటలకు నకిరేకల్ బీఆర్ఎస్ కార్యాలయానికి చేరుకున్నారు. కట్టంగూర్, నకిరేకల్, కేతేపల్లి మండలాల నుంచి వచ్చిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో, బూత్ ఏజెంట్లతో ఎన్నికల సరళి, పోలింగ్ విధానం బూత్‌ల వారీగా, గ్రామాల వారీగా విశ్లేషించుకున్నారు. 7 గంటల ప్రాంత ంలో నకిరేకల్ నుంచి నార్కట్‌పల్లికి బయల్దేరారు.

## ముత్యాలు మృతదేహానికి మండలి చైర్మన్ గుత్తా నివాళి

చిట్యాల, డిసెంబర్ 1 : చిట్యాలకు చెందిన బూడిద ముత్యాలు అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి శుక్రవారం ఉదయం మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆయన వెంట మాజీ సర్పంచు గుండెబోయిన శ్రీలక్ష్మి, నాయకులు కర్నాటి ఉప్పల వెంకట్‌రెడ్డి, ఆవుల అయిలయ్య, గుండెబోయిన సైదులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సూర్యాపేట రూరల్, డిసెంబర్ 1 : రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా, భార్యకు తీవ్ర గాయాలైన ఘటన సూర్యాపేట పట్టణ పరిధిలోని పిల్లలమర్రి క్రాస్ రోడ్డు వద్ద 65వ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేతేపల్లి మండలం కొత్తపేటకు చెందిన కంచాని బుచ్చినర్సయ్య(59), భార్య జానకమ్మ (57)తో కలిసి బైక్‌పై కొత్తపేట నుంచి సూర్యాపేటకు వస్తున్నారు. పిల్లలమర్రి స్టేజీ వద్ద రోడ్డు క్రాస్ చేస్తుండగా విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న గూడ్స్ వాహనం ఢీకొట్టింది. దాంతో బుచ్చినర్సయ్య తలకు, ఎడమ కాలికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. జానకమ్మ తలకు, కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. బుచ్చిరామయ్య కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ సాయిరామ్ తెలిపారు.

## ఎన్నికల కమిషన్ చర్యల వల్లే ప్రశాంతంగా పోలింగ్

- సమాచార హక్కు పరిరక్షణ సమితి జాతీయ చైర్మన్ కేశవులు



విలేకరులతో మాట్లాడుతున్న కేశవులు, పక్కన సభ్యులు

నల్లగొండ, డిసెంబర్ 1: ఎన్నికల కమిషన్ తీసుకున్న పకడ్బందీ చర్యల వల్ల రాష్ట్రంలో జరిగిన శాసన సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని సమాచార హక్కు పరిరక్షణ సమితి జాతీయ చైర్మన్, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ బొమ్మరబోయిన కేశవులు తెలిపారు. నల్లగొండలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలలో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకున్నారని చెప్పారు. రాష్ట్రంలో 70.66 శాతం పోలింగ్ జరిగిందని, జిల్లాలో 85.43 పోలింగ్ శాతం జరిగిందని తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్, సిబ్బంది, ఆర్ఓలు తీసుకున్న చర్యలు, ఎప్పటికప్పుడు సమీక్షలు, సమావేశాలతో పర్యవేక్షణలో స్వేచ్ఛగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించు కున్నరని తెలిపారు. పోలీస్ శాఖ, ఎస్పీ, డీఎస్పీ, సీఐ, ఇతర సిబ్బంది కృషితో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నందుకు అభినందనలు తెలిపారు. నల్లగొండ కలెక్టర్, ఎస్పీ, ఎన్నికలలో పాలుపంచుకున్న ప్రతి అధికారి, సిబ్బందికి, ఓటర్లకు ఎన్నికల వాచ్ కమిటీ, తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో మేకల శ్రీహరి, శ్రీనివాస రావు, సింగారపు మల్లయ్య , నన్నూరి లింగారెడ్డి, కట్టా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.